

ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు

◆కలెక్టర్ టిఎస్.చేతన్

◆శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అభివద్ధి, సంక్షేమ ఫలాలను జిల్లా ప్రజలందరికీ అందించేలా చర్యలు తీసుకుంటానని నూతన కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్‌గా కలెక్టరేట్‌లో బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలందరికీ సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి పతంలో ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్‌ఒ కొండయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.


ఉమ్మడిగా పని చేద్దాం : కలెక్టర్

ప్రభుత్వం, ప్రజల ఆకాంక్షలకు తగినట్టుగా ప్రభుత్వ ఉద్యోగులంతా క్రమశిక్షణ, జవాబుదారీ తనంతో ఉమ్మడిగా విధులు నిర్వహిద్దామని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మీకోసం సమావేశం మందిరంలో జిల్లా అభివద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజాయితీ, బాధ్యతతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ల ద్వారా ఉచిత ఇసుక విధానం పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లతో అర్హులందరూ లబ్ధి పొందేలా చూడాలన్నారు. అన్నక్యాంటీన్ల స్థితిగతులను తెలుసుకుని వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం నాడు నిర్వహించే జిల్లా, మండల స్థాయి సమావేశాలకు సంబంధించి పూర్తి వివరాలతో సంబంధిత అధికారులు పిపిటి స్థాయిలో ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో నిధియాదేవి, డిఆర్‌ఒ కొండయ్య, సిపిఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల నిలయం సత్యసాయి జిల్లా

◆ నేడు అభివృద్ధిపై మంత్రుల సమీక్ష

◆ సమస్యలకు పరిష్కారం చూపేరా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు కాటకాలకు నిలయమైన సత్యసాయి జిల్లా సమస్యల నిలయంగా ఉంది. ఎక్కువ వలసలుండే ప్రాంతంగానూ ఉంది. ఉపాధి కోసం కర్నాటక, కేరళ రాష్ట్రాలకు ఇక్కడి కూలీలు వలసలు వెళుతుంటారు. ఈ జిల్లా అభివృద్ధిపై నేడు ఇద్దరు మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సత్యసాయి జిల్లా నుంచి మంత్రులైన వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలు తొలిసారిగా జిల్లాలోని సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో ఎటువంటి పరిష్కారాలను తీసుకొస్తారో చూడాల్సి ఉంది.

వలసలు అత్యధికం

సత్యసాయి జిల్లాలో కదిరి, పుట్టపర్తి, మడకశిర తదితర ప్రాంతాల నుంచి అత్యధికంగా వలసలు ఉంటాయి. ఏ మాత్రం సాగునీటి వసతిలేని ఈ జిల్లాలో ఖరీఫ్ పంట కాలం ముగియగానే ఉపాధిని వెతుక్కుంటూ కర్నాటక, కేరళ రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో వలసలు పోతుంటారు. ఆ సమయాల్లో గ్రామాలకు గ్రామాలు ఖాళీగా దర్శనమిస్తూ ఉంటాయి. ఇప్పటికీ ఈ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోనే ఉపాధి కల్పించే కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. తక్కిన ప్రాంతాల్లో ఒక్క చిన్న పరిశ్రమ కూడా లేవు. దీంతో బెంగళూరు కొచ్చిన్ తదితర నగరాలకు వలసలుపోతుంటారు. ఈ వలసల నివారణకు తీసుకున్న చర్యలేవీ ఇంత వరకు లేవు.

వ్యవసాయం అంతా వర్షాధారంపైనే ఆధారం

అనంతపురం జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా నీరందే నిఖరమైన ఆదరువు ఉంది. కాని సత్యసాయి జిల్లాలో అటువంటిలేదు. ఎంతసేపు హంద్రీనీవాపైనే ఆధారపడాల్సి వస్తోంది. అది కూడా బాగా వర్షాలు పడిన ఏడాది ఉంటోంది తప్ప తక్కిన సమయాల్లో ఉండటం లేదు. హంద్రీనీవాలోనూ మడకశిర ఎత్తిపోతల పథకం పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పుట్టపర్తికి ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు నీరందిస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీ కూడా ఇంకా పూర్తి స్థాయి అమలుకు నోచుకోలేదు. నిఖరమైన సాగునీటి జలాల్లేక వర్షాధారంపైనే ఆధారపడి ఇక్కడి రైతులు పంటలు సాగు చేయాల్సి వస్తోంది. సకాలంలో వర్షాల్లేక వరుస నష్టాలను చవిచూడటమే ఆనవాయితీగా మారింది.

ఐదేళ్లుగా అందని పట్టురాయితీ

గడిచిన ఐదేళ్లుగా పట్టు రైతుకు అందాల్సిన పెట్టుబడి రాయితీ అందలేదు. పట్టు రైతులు అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇవ్వలేదు. ఇస్తామని చెబుతూనే దాటవేయడం జరిగింది. అదే విధంగా పట్టు రీలర్లకు రావాల్సిన సబ్సిడీ కూడా మంజూరవలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వమైన పట్టురైతుల సమస్యలపై దృష్టి సారిస్తుందా లేదన్న రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో మల్బరీ సాగయ్యేది ఇక్కడే. కాని ఇక్కడ పట్టు రైతుకు తగినంత ప్రోత్సహం లేదు.

రహదారులూ ఎక్కడివక్కడే

రహదారుల పరిస్థితీ ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. గడిచిన రెండేళ్లుగా పంచాయతీ రాజ్ పరిధిలోనే చేపట్టిన పనులే 21 శాతం కూడా పూర్తవలేదు. రోడ్లు భవనాల శాఖ పరిధిలోనూ పనులు ఇదే రకంగా ఉన్నాయి. తాగునీటి పథకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. రక్షిత మంచినీటి సౌకర్యం కూడా లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. ఈ సమస్యలన్నింటినిపై నేడు జరిగే సమావేశంలో మంత్రులు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారో అని జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సమస్యలపై పోరాటం..!

జిల్లా వ్యాప్తంగా కోర్కెల దినోత్సవం నిరసనలు



హిందూపురంలో నిరసన ర్యాలీ

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న స్కీం వర్కర్లు, ఉద్యోగుల పై రాజకీయ ఒత్తిళ్లను ఆపాలని, తదితర ప్రధాన డిమాండ్లతో సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి.

పూర్తి వార్త 6లో



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ

రెండు కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - సోమందేపల్లి

సోమందేపల్లి మండల కేంద్రంలోని నక్కలగుట్ట వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ బాజీజాన్‌సైదా వెల్లడించారు. ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాల మేరకు గంజాయి, హెరాయిన్, డ్రగ్స్ తదితర వాటి నియంత్రణకు గట్టి నిఘా ఉంచామన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం సోమందేపల్లి మండల కేంద్రంలోని నక్కల గుట్ట వద్ద పెనుకొండ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్, సోమందేపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు అనుమానితులను పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరినీ విచారించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు బయట పడిందన్నారు. ఒడిశా రాష్ట్రం బాలంగిర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరూ అక్కడి నుంచి గంజాయి ప్యాకెట్లను తీసుకొచ్చి హిందూపురం, పెనుకొండ పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారని తెలిసిందన్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ఇద్దరు గంజాయి విక్రేతలు ఉన్నట్లు సమాచారం ఉందని, త్వరలో వారిని పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ, దసగిరి, జగన్నాథ్ నాయక్, నగేష్ పాల్గొన్నారు. గంజాయి స్వాధీనంలో కృషి చేసిన పెనుకొండ సిఐ యుగంధర్, సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డులు ఇచ్చారని తెలిపారు.

పుట్టపర్తి అభివృద్ధికి సహకరించాలి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తి అభివృద్ధికి తమవంతుగా సహకరించాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రి సవిత బుధవారం అనంతపురంలోని పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి వెళ్లగా పల్లె రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అందించాల్సిన సహకారం గురించి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆయన కుమారుడు పల్లె వెంకటకృష్ణ కిషోర్, మంత్రి భర్త వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎంజిఎం' హెచ్‌ఎంపై డీవైఈవో ఆగ్రహం

ప్రజాశక్తి -హిందూపురం

పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత (ఎం జి ఎం) పాఠశాలను డీవైఈవో రంగస్వామి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన విద్యాకానుక కిట్ల వివరాలు, మధ్యాహ్న భోజన వివరాల రికార్డులు సరిగా లేకపోవడంతో హెచ్‌ఎం సామ్రాజ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం, వారికి సరిపడా అందించాలని హెచ్‌ఎంను ఆదేశించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈవో రంగస్వామి

పేదలకు ఇళ్ల స్థలాలు , సాగు భూములకు పట్టాలివ్వాలి

మంత్రి సవితను కోరిన సిపిఎం నాయకులు



మంత్రికి సమస్యలను వివరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల పరిధిలోని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. ఇంతియాజ్ కోరారు. బుధవారం పెనుకొండలో మంత్రి సవితను సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో ఇంతియాజ్‌తో పాటు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న తదితరులు కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు నాసన్ , బెల్ కంపెనీకి భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేదలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుండి పెనుకొండ , రొద్దం , సోమందేపల్లి , గోరంట్ల , చిలమత్తూరు , హిందూపురం ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కోసం గుడిసెలు , ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్నారన్నారు. భూములు లేని పేదలు ప్రభుత్వ భూములను సాగు చేసుకొని జీవనం గడుపుతున్నారని తెలిపారు. నాసన్ , బెల్ కోసం భూములు కోల్పోయి పాలసముద్రం , చిన్న బాబయ్య పల్లి గ్రామాలకు చెందిన చిన్న , సన్నకారు రైతులు ఉపాధి లేక నిర్వాసితులయ్యారన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసంతో పాటు ప్రభుత్వ సంస్థలలో అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రిగా జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు , కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు హనుమయ్య , రమణ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు , స్వర్ణలత, ఇళ్ల స్థలాలు , సాగు భూముల పోరాట కమిటీ నాయకులు అంజలీదేవి , జ్యోతమ్మ , నిర్మల , భాగ్యమ్మ , స్థానిక సిపిఎం నాయకులు తిప్పన్న, వందమంది పేదలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రోహిల్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు తదితర అంశాలపై టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జేఈ వెంకటస్వామిలతో కలిసి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్ వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాలైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రికి వచ్చే రోజులు తప్పనిసరిగా వారి వద్ద ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని వస్తే ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్సలు సైతం చేయడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితంగా ఇస్తామన్నారు. అయితే ఆసుపత్రిలోని కొన్ని విభాగాల్లో రోగుల నుంచి కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఎవరైనా అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులను అనవసరంగా ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తే, రెఫర్ చేసిన వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను వైద్యులు వారు నిర్వహించే ఆసుపత్రులకు తీసుకు వెళితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనకాడమన్నారు. సిటీ స్కాన్ సేవలు అందుబాటులో లేక చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఉన్నత అధికారులకు వివరించామని, వారు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 78 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, వీటి నిర్వహణ కోసం తగిన సిబ్బందిని నియమించాలని ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఎంఒ డేవిడ్ రాజు, ఇతర వైద్యులు, టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అసుపత్రికి రెండు అంబులెన్స్‌లు ప్రకటించిన జెఇ.వెంకట స్వామి

అసుపత్రిలో రోగుల సౌకర్యార్థం తన సొంత నిధులతో రెండు అంబులెన్స్‌లను ఇస్తున్నట్లు అసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మేన్ జేఈ వెంటక స్వామి ప్రకటించారు. బుధవారం అసుపత్రి సందర్శనకు వచ్చిన ఆయనకు మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్ సమస్యను వివరించారు. దీంతో ఆయన రెండు అంబులెన్సులు ఇస్తున్నట్లు ప్రకటించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు చర్యలు


ప్రజాశక్తి- మడకశిర

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేంద్రని కలిసి మడకశిర నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గానికి పెండింగ్లో ఉన్న 412 అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్లు, వెయ్యి అగ్రికల్చర్ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎస్ఇ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎంఎస్. రాజుకు తెలిపారు.

మున్సిపాలిటీ అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

'ప్రజాశక్తి' కథనాల పై కౌన్సిల్‌లో ప్రస్తావన

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అవినీతి బాగోతంపై చర్చ జరగాలని సమగ్ర విచారణ చేపట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు ఛైర్పర్సన్ నజీమున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే ముందుగా మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అవినీతి బాగోతంపై చర్చ జరగాలని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కౌన్సిలర్లు పట్టుపట్టారు. మున్సిపల్ కార్మికులు పరిహారం మంజూరులో, కారుణ్య సాయం మంజూరులో అధికారుల చేతివాటంపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వరుస కథనాలను ఈ సందర్భంగా కౌన్సిలర్లు ప్రస్తావించారు. అవినీతి అనకొండల పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఫయాజ్ అలీ డిమాండ్ చేశారు. అనంతరం కౌన్సిలర్లు ఫయాజ్, కృపాకర్ రెడ్డి, కిన్నెర కళ్యాణ్, ఆల్ఫా ముస్తఫా పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. మున్సిపాలిటీ లో జేసీబిలకు డీజిల్ పేరుతో రెండు కోట్లరూపాయల నిధులు స్వాహా చేశారని వీటి పై సమగ్ర విచారణ జరిపించాలని కౌన్సిలర్ కృపాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.భూ కబ్జాలు అక్రమ లేఅవుట్లు, జగనన్న కాలనీలో పేదలకు పట్టాల పేరుతో కొందరు పట్టాలు అక్రమంగా పొంది అవినీతికి పాల్పడ్డారని అవినీతి అక్రమాలపై విజిలెన్స్, ఏసీబీల తో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అజెండాలో ఉన్న అంశాలు అవినీతితో ఉన్నాయని అంశాలను తిరస్కరించాలని టిడిపి కౌన్సిలర్లు పట్టు పట్టారు. టిడిపి కౌన్సిలర్ల నిరసనతో అజెండాలోని అంశాలు చర్చించకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్నిముగించారు. అంతకుముందు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కదిరి పట్టణ అభివద్దే తమ లక్ష్యమని, పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జీవో 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గుదిబండగా మారిన 117 జీవోను రద్దు చేయాలని యుటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకురావడం వల్ల గ్రామాల్లో సుదుర ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులు చదువుకునేకి వీలు లేకుండా. పోవడంతో చాలామంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే జీవోను రద్దు చేయాలని కోరారు. అనంతరం యుటిఎఫ్ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సునీల్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

బుల్లసముద్రం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ విశ్వనాథ్ దాతల సహకారంతో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు 30 వేల రూపాయల విలువజేసే నోటు పుస్తకాలను బుధవారం అందజేశారు. మండల పరిధిలోని బుల్లసముద్రం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని బుల్లసముద్రం, చీపులేటి, ఛత్రం, దేవన్నపాలెం ,అయ్యవారిపాలెం ,బీరాయపురం, ఒంటిపాలెం ,క్యాంపురం ,ఉప్పర్లపల్లి ,భక్తరపల్లి ,దొడ్డేపల్లి గ్రామాల పాఠశాల విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుల్లసముద్రం మాజీ సర్పంచి జైపాల్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీనివాస పీజీ, డిగ్రీ కళాశాలలో టీవీఎస్ అండ్ టీఎస్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ పరిధిలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 64 మంది డిగ్రీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఇందులో 9మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకట క్రిష్ణ కిషోర్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ గోపాలక్రిష్ణ, బాబా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పుష్పవాహనరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండలమీట్

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక జీవనజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో ఎంపీడీవో బాబు ఖాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. అధికారులు తమ ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. పలు సమస్యలను ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లు, ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి : సిఐటియు



పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, తదితరులు



బత్తలపల్లిలో వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న స్కీం వర్కర్లు, ఉద్యోగుల పై రాజకీయ ఒత్తిళ్లను ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్ డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కోర్కెల దినం సందర్భంగా బుధవారం పుట్టపర్తి లోని గణేష్ కూడలి నుండి ఆర్‌డిఒకార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఇఎస్. వెంకటేష్, ఇంతియాజ్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ,ఆశ ,ఐకెపి మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, స్వచ్ఛభారత్ వివిధ ప్రభుత్వ సంస్థలలో పనిచేసే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు సాగుతున్నాయని వాటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, సర్వ శిక్ష, విద్య వైద్య రంగంలో పనిచేసే వారందరికీ వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ,ఆటో, హమాలీ, తోపుడుబండ్లు తదితర సంఘటిత కార్మిక సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బాబావలి ,రాజు రావు, అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మాబు న్నీసా, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ లక్ష్మీదేవి, పద్మా, సరస్వతి, శాంతి భాయి, పార్వతి అనూష, మీనా కుమారి, సుజాత, సుధామణి ,అరుణ, అనిత ,కవిత ,చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీలపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఐసిడిఎస్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు శ్రామిక జిల్లా మహిళా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ కేంద్రం లో, రాష్ట్రం లో కొత్త ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నాని విమర్శించారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వాసంతి, సెంటర్ లీడర్స్ వసంతం,రజిత, శశికళ, సున్ని బేగం,క్రిష్టవేణి, జయసుధ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తాడిమర్రి మండలంలో అంగన్వాడీలు నిరసన నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నారాయణ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : అంగన్వాడీ కోర్కెల దినోత్సవ సందర్భంగా అంగన్వాడీల సమస్యలను తీర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రమణ, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీరాములు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి రంగమ్మ అధ్యక్షులు ఆశీర్వాదమ్మ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఐ నాగేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్లు మణిమాల, షమీం, వరలక్ష్మి, విమలమ్మ, ఆదిలక్ష్మి, కార్యకర్తలు స్వర్ణ, సునంద, జయమ్మ ,శ్యామల, మంజుల, చంద్రకళ ,రత్నమ్మ ,వెంకట నరసమ్మ ,పార్వతి, సుకన్య, శ్యామలమ్మ, భారతి, కళావతి, అఖిల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల కన్వీనర్ ఒంటెద్దు వేమన్న ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, వ్యవసాయ కార్మిక సంఘం శ్రీనివాసులు, భవననిర్మాణ కార్మికులు సంఘం శ్రీనివాసులు, అంగనవాడీ నాయకురాలు భాగ్యమ్మ ఆశ మండల కార్యదర్శి కళావతి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ గిరికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, రాజు రావు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, ప్రాజెక్ట్ కోశాధికారి మాబున్నీసా, సెక్టర్ లీడర్లు సావిత్రమ్మ ,లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, శాంతి భాయ్, పార్వతి, అనూష, మీనా కుమారి,సుజాత, సుధామణి, అరుణ, అనిత, కవిత, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి హెచ్ మహబూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీ, ఆశా కార్యకర్తలపై చేస్తున్న రాజకీయ వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ వర్కస్ గుడిబండ ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎమ్. నాగమణి, అనసూయ, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కార్మికుల పొట్టకొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లు తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయు నాయకులు జీఎల్. నరసింహులు, జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో రోడ్లు భవనాలు అతిథిగృహం నుండి కాలేజ్ సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లులను ఉపసంహరించాలని,కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, కార్మికుల పని గంటలు తగ్గించాలని, రాష్ట్రంలో అంగన్వాడీలు, ఆశా కార్యకర్తల అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.ఎల్. నరసింహులు, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, ఆంజనేయులు అంగన్వాడి యూనియన్ నాయకులు మాబున్నిషా, సుజాత, రామలక్ష్మమ్మ, సుశీల, చంద్రకళ, సువర్ణ, భాగ్యమ్మ, సరోజ మున్సిపల్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, తిరుపాలు, జనార్ధన, సూరి, సివిల్ సప్లై హమాలీలు శివప్రసాద్, చెన్నరాయుడు, షఫీ పాల్గొన్నారు. వీరి నిరసనకు రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు బడా సుబ్బిరెడ్డి, బాబ్జాన్ సంఘీభావం తెలిపారు.

ముదిగుబ్బ : కోర్కెల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని తహశీల్దార్ కార్లాయయంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిపిఎం, సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : కోరికల దినోత్సవం సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సాంబ ఆధ్వర్యంలో అంగనవాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ శ్రావణికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, భారతి, సుమ, రమణమ్మ, పారిశుధ్య కార్మికులు హక్కుల కదిరప్ప, నరసింహులు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు

నంబుల పూలకుంట : కోరికల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు తమ డిమాండ్లతో కూడిన వినతిప్తరాన్ని తహశీల్దార్‌కు సమర్పించారు, ఈ కార్యక్రమంలో అంగనవాడీ, ఆశ కార్యకర్తలు, రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి, సిఐటియు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : కోర్కెల దినోత్సవం సందర్భంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీ, ఆశాలు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ బాలనరసింహులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహప్ప, అంగనవాడీ సెక్టర్ లీడర్లు ధనమ్మ, భాగ్యమ్మ, పార్వతి, శశికళ, ఆశా వర్కర్స్ యూనియన్ లీడర్లు రాధమ్మ, పద్మావతి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మండలంలోని అంగన్వాడీలు బుధవారం పరిగి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ అధ్యక్షురాలు రాధమ్మ, కెవిపిఎస్ నాయకులు రమణ, ఫ్రీ కాట్ మిల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కార్మికుల కోర్కెల దినోత్సవ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు,ఆశా కార్యకర్తలు,పంచాయతీ పారిశుధ్య కార్మికులు,ఆటో వర్కర్లు చిలమత్తూరు మండల కేంద్రం లోని తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిఐటీయు నాయకులు ప్రవీణ్ కుమార్,వెంకటేష్, లక్ష్మీ నారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరయ్యకు అందజేశారు. అంతకు ముందు సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అయూబ్‌ఖాన్, ఎల్ఆదినారాయణ, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకులు ఎన్‌హెచ్. బాషా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, అంగన్వాడీలు పాల్గొన్నారు.



హిందూపురంలో మోకాళ్లపై కూర్చొని నిరసన చేస్తున్న అంగన్వాడీలు

మడకశిర : తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుండి అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్ లీలావతికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం సమర్పించారు.

అమడగూరు : కోరికల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ వెంకట రెడ్డికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, కోశాధికారి కిష్టమ్మ, పద్మ, తులసి, సరళ, మమత తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ అంజన దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజగోపాల్, అంగన్వాడీ కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు నాయకులు పెద్దన్న, లక్ష్మీనారాయణ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం సిఐటియు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రోడ్డుపై మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డికి వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లావణ్య, సిఐటియు పట్టణ నాయకులు విఆర్ రాము, ఆటో యూనియన్ నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ, ఆటో యూనియన్ కార్యదర్శి బాబా, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లికార్జున, ప్రికాట్ మిల్ యూనియన్ నాయకులు సదాశివరెడ్డి, జయరాం రెడ్డి, నందీశ్వర, అంగన్వాడీ యూనియన్ నాయకులు శైలమ్మ, వరలక్ష్మి, శిరీష పెద్ద ఎత్తున వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూ దోపిడీలో కేటీఆర్, కేతిరెడ్డి ఒకే జాతి పక్షులు

మంత్రి సత్యకుమార్‌యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

భూదోపిడీలో అటు ఏపీ, ఇటు తెలంగాణాలో వైసీపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకేజాతి పక్షులుగా నిలిచాయని అందుకే దొంగలుదొంగలంతా ఒకటై ఎన్డీఏ ప్రజాపాలనపై విమర్శిస్తున్నారని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ విమర్శించారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం ధర్మవరం ఆర్టీసీ డిపోలో నూతన బస్సు సర్వీసు ప్రారంబించిన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగించినందు వల్లనే ఓడి పోయామనే విషయాన్ని మరిచిపోయి అటు కేటీఆర్ ఇటు కేతిరెడ్డి విమర్శలకు దిగడం వారిఅజ్ఞానానికి నిదర్శనమన్నారు. ధరణి పోర్టల్ భూ మాఫియాను తెలంగాణాలో ఎలా ప్రారంభించారో రాష్ట్రంలో కూడా వైఎస్ జగన్, ధర్మవరంలో కేతిరెడ్డివెంకటరామిరెడ్డి గుడ్ మార్నింగ్ పేరుతో సందులు, గొందులు తిరిగి భూ కబ్జాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, చివరికి చెరువులు, కొండలు కూడా వదలకుండా కాజేశారని విమర్శించారు. కేతిరెడ్డి అవినీతి భూదోపిడీల గురించి కేటీఆర్‌కు తెలిసినట్టు లేదన్నారు. ఒపీలో జగన్, ధర్మవరంలో కేతిరెడ్డి ప్రజాకంటకులుగా మారి ఓడిపోయారని అన్నారు. తెలంగాణాలో కేసీఆర్, కేటీఆర్ జీడీపీ గురించి కేంద్రప్రభుత్వాన్ని విమర్శిస్తే అందుకు ప్రతిగా తాను కూడా విమర్శించానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జీడీపీ పెరిగిందికానీ అది రాష్ట్రానికికాదు కేసీఆర్ కుటుంబానికి పెరిగిందంటూ ట్విట్టర్లో పెడితే వాటిని కేటీఆర్ బ్లాక్ చేయడం చూస్తుంటే అతని మనస్తత్వం ఎలాంటిదో తెలుస్తోందన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పెండింగ్ వేతనాలు, సమ్మెకాలపు వేతనం ఇవ్వాలన్న డిమాండ్‌తో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఓబిరెడ్డి, రామన్న మాట్లాడుతూ 3నెలల పెండింగ్ వేతనాలు, 22రోజుల సమ్మె కాలం వేతనం, సమ్మె అగ్రిమెంట్స్ అమలు, హెచ్‌ఆర్ పాలసీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వైజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఎక్స్ప్రేషియా రూ. 20 లక్షలకు పెంచాలని, మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోని కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జట్టుకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్



రాష్ట్ర జట్టుకు ఎంపికైన సత్యసాయిజిల్లా జట్టు సభ్యులతో అసోసియేషన్ ప్రతినిధులు

హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17వతేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే దక్షిణాది రాష్ట్రాల జూనియర్ బాలుర, బాలికల హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి జట్టుకు సత్యసాయిజిల్లా జట్టు సభ్యులు ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు బందనాథం సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా జట్టులో మహబూబ్ బాషా, పవిత్ర, సింధు, నసీమా ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను హాకీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడితో పాటు జిల్లా ప్రసిడెంట్ బీవీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, హాకీ కోచ్ హుస్సేన్ అభినందించారు.

ధర్మవరం - చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం



నూతనబస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం–చెన్నై నూతన బస్సు సర్వీసు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. పట్టు కేంద్రం ధర్మవరం నుంచి చెన్నైకి పుట్టపర్తి, కదిరి, మదనపల్లి, తిరుపతి మీదుగా వెళ్తుందని ఆర్టీసీ ఆర్ఎం మదుదసూదన్ మంత్రికి వివరించారు. ఈ సర్వీసు ఏర్పాటుచేయడం వల్ల చెన్నైకు ధర్మవరం నుంచి వెళ్లే వ్యాపారస్థులకు, కార్గో సర్వీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా తిరుపతి,చెన్నైలో చదువుకుంటున్న విద్యార్థులకు, ఉద్యోగం చేసే వాళ్లకు కూడా ఉపయోగపడుతుందని ఆర్ఎం పేర్కొన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ఆన్లైన్లో టికెట్లు బుక్ చేసుకునేలా లింకును ఈబస్సు ద్వారా ఆర్టీసీ కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, ధర్మవరం డీఎం సత్యనారాయణరావు, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, సందారాఘవ , జింకా పురుషోత్తం,కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, దుస్తులు పంపిణీ చేశారు. తెలుగుదేశం నాయకులు, మాజీ సర్పంచి శ్రీ రామ్ నాయక్, వనం కష్ణారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి శ్రీ రామ్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం నేర్చుకోవాలని కోరారు. .ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, అజీమ్ , పాఠశాల సిబ్బంది, తెలుగుదేశం నాయకులు బొమ్మయ్య, చిన్న కుల్లాయప్ప, బాబూ, జీక్రియ తదితరులు పాల్గొన్నారు.

జీవో 101ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జీవో నెంబర్ 101ను వెంటనే పునరుద్ధరించి అమలు పరచాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం అధ్యక్షులు బొల్లె ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం పుట్టపర్తి లో విలేకరులతో మాట్లాడుతూ 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఈ జీవో 101ను తీసుకు రాగా దానిని వైసిపి ప్రభుత్వం అమలు పరచకుండా మరుగున పడేసిందన్నారు. ఉపాధ్యాయులకు ప్రోత్సాహకరంగా ఇచ్చే మంచి ఉద్దేశంతో పెట్టిన జీవోను అమలుపరచుకుండా రద్దు చేశారని దానిని వెంటనే పునరుద్ధరించి అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ట్రెజరర్ శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని తురకల పట్నం గ్రామానికి చెందిన హరికృష్ణ (27) అనే యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుని తల్లి జయమ్మ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జయమ్మ తన చిన్నకుమారుడు హరికృష్ణకు పెళ్లిసంబంధాలు చూస్తుండగా హరికృష్ణ అభ్యంతరం చెప్పేవాడు. తాను ఒక యువతిని ప్రేమిస్తున్నానని, ఆమెనే వివాహం చేసుకుంటానని చెప్పేవాడు. ఈ విషయంపై మంగళవారం రాత్రి హరికృష్ణకు ఆమె తల్లి జయమ్మ, అన్నకు మధ్య పెళ్లిసంబంధ విషయంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో హరికృష్ణ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివశంకర్ నాయక్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పొప్పన పల్లి తండాకు చెందిన శివశంకర్ నాయక్ తన వ్యక్తిగత పనులు ముగించుకొని గోరంట్ల నుంచి ద్విచక్ర వాహనంలో తన స్వగ్రామానికి బయలు దేరాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శివశంకర్‌నాయక్‌ను మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు

గుండెపోటుతో వీఆర్వో మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - పరిగి



బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మండలంలోని శ్రీరంగరాజుపల్లి విఆర్ఒ రామకృష్ణ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం అనారోగ్య కారణంగా పెరల్ స్ట్రోక్ గురైన ఆయన మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. మడకశిర మండలం మనూరు గ్రామానికి చెందిన రామకృష్ణ మృతి పట్ల రెవెన్యూ అధికారులు, తోటి సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వభారత్ బుధవారం వీఆర్వో స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యుల ఓదార్చారు. దహన సంస్కారాల కోసం ప్రభుత్వం అందించే 25 వేల రూపాయలను మృతుని భార్యకు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ నరసింహతో పాటు సూపరింటెండెంట్ మురళి, ఆర్ఐ సిద్దేశ్వర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

తనకల్లు : మండలంలోని కొర్తికోట మాజీ ఎంపీటీసీ మంజునాథ్ తల్లి లక్ష్మిదేవి మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తొట్లి రెడ్ శేఖర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బీగం శంకర్ నాయుడు, తెలుగు మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, నాగేంద్ర ప్రసాద్, మధుకర్ నాయుడు, గిరిధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : సిద్ధరాంపురం మాజీ ఎంపీటీసీ జయశంకర్ అకస్మాత్తుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మృతుడు జయశంకర్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని మాజీ మంత్రి పల్లె భరోసా ఇచ్చారు. జయశంకర్ పార్టీకి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి , నాయకులు వెంకటనారాయణ రెడ్డి, మాజీ సర్పంచి సాకే యశోద,గంగాధర్, సుబ్బారెడ్డి, లావణ్య గౌడ్, మాజీ ఎంపీపీ బాలు, వెంకటరాముడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తకు మంత్రి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండలోని హమాలీ, టిడిపి కార్యకర్త రహంతుల్లా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత బుధవారం కార్యకర్త రహంతుల్లా ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.